ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 24.05.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. జూన్ 1వ తేదీ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది.

2. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి పర్యాటక రంగాన్ని ప్రధాన ఇంజన్‌గా మారుస్తామని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.

3. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు , మిల్లుల్లో దిగుమతులను జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.

4. రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు , వడగాలుల తీవ్రత కొనసాగుతోంది. వడ దెబ్బ బారిన పడకుండా, ప్రజల ప్రాణ రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లను సమాచార , పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

-------------------------------

**తెలంగాణ కేబినెట్**

రాష్ట్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది. నిన్న జరిగిన సమావేశంలో మంత్రివర్గం.. రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు ఆమోదం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2 లక్షల 50 వేల మంది పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మించాలని , ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ రెండు నాటికి దాదాపు లక్ష ఇళ్ల గృహ

ప్రవేశాలు జరుగుతాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కొలారి గ్రామంలో కొలాం ఆదివాసీలకు ప్రభుత్వం కట్టించిన 28 ఇందిరమ్మ ఇళ్లను జూన్ 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల వారి కోసం లక్ష LIG ఇళ్లు నిర్మించి ఇవ్వాలని మంత్రివర్గం తీర్మానించింది. అలాగే గుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని నిర్ణయించింది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి గోడలు , శ్లాబు దశలో నిలిచిపోయిన వాటిని కూడా పూర్తి చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం పునాదులు పూర్తయి గోడలు , శ్లాబు పడని ఇళ్లకు 3 లక్షలు, గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు 2 లక్షలు చొప్పున అందించనుంది ప్రభుత్వం.

**బైట్ - పొంగులేటి**

**డెస్క్**

---------------------------------

**పర్యాటక సదస్సు**

పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజన్‌గా మారుస్తామని , తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో డెస్టినేషన్ తెలంగాణ – రోడ్ అహెడ్ పేరిట నిన్న నిర్వహించిన పర్యాటక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలోని పర్యాటక రంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని, ప్రైవేట్ భాగస్వామ్యంతో టూరిజం ప్రాజెక్టులను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు , యాజమాన్యాలు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతిపాదనలతో పాటు డీపీఆర్ లను సమర్పిస్తే, ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎంపిక చేసిన పర్యాటక

ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ప్రకటనలు జారీ చేయనుందని , ఎంపికైన సంస్థలకు డిజైన్లు , ప్రాజెక్ట్ అంచనాల వ్యయాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.

**బైట్ జూపల్లి**

**డెస్క్**

---

**పంటల సాగుపై తుమ్మల**

మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయాలని , పంట మార్పిడి విధానాలను అనుసరించాలని రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ లోని...ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ...విత్తన వారోత్సవాలను నిన్న మంత్రి ప్రారంభించారు. డిజిటల్ అగ్రికల్చర్ , టెక్నాలజీ సెంటర్ ను సందర్శించి ఆధునిక డ్రోన్స్ వినియోగంపై చేస్తున్న పరిశోధనల గురించి తెలుసుకున్నారు. SBI - CSR నిధుల సాయం తో అభివృద్ధి చేసిన రోబోటిక్స్ అండ్ సెన్సర్ బేస్డ్ ప్రయోగశాలని సందర్శించారు. కొన్ని రోబోలని వ్యవసాయ రంగంలో ఉపయోగించే అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తలను అభినందించారు. రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు.. ఆధునిక టెక్నాలజీని అందించాలని సూచించారు.

**డెస్క్**

**స్కూల్స్ అభివృద్ధి**

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు , విద్యాభివృద్ధి కోసం పలు సంస్థలు. ముందుకు వచ్చాయి . కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నిధులు అందజేస్తున్నాయి. ఆయా సంస్థల ప్రతినిధులు...నిన్న సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని జవహర్ నగర్ లో స్కూల్ , జూనియర్ కాలేజీ నిర్మాణానికి 19 కోట్లు , రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆధునీకరణ, ఇంటర్ తరగతి గదుల నిర్మాణానికి 10 కోట్ల రూపాయలను ఒక ఫౌండేషన్

వెచ్చించనుంది. రంగారెడ్డి జిల్లా కొండాపూర్ లో ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు తరగతి గదుల కోసం 50 కోట్లను మరో గ్రూప్ ఖర్చు చేయనుంది . మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని సుభాష్ నగర్ మండల పరిషత్ స్కూల్ లో ప్రీ ప్రైమరీ , 6వ, 7వ తరగతుల కోసం 12 కోట్లను ఓ ప్రైవేట్ హాస్పిటల్స్ భరించనుంది.

**డెస్క్**

**సిద్దిపేట కలెక్టర్**

రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. రాత్రి సిద్దిపేట ఆధునిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఆకస్మిక తనిఖీలు చేసిన కలెక్టర్.. ధాన్యం కొనుగోలు , దిగుమతి ప్రక్రియను పరిశీలించారు. అకాల వర్షాలకు తడిసిపోకుండా.. రాత్రి పూట తప్పనిసరిగా ధాన్యంపై టార్పాలిన్లు కప్పి ఉంచాలని , ధాన్యం కొట్టుకుపోకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులు , రైతులకు సూచించారు. సిద్దిపేట మార్కెట్లోనూ, జిల్లా వ్యాప్తంగానూ ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరుగుతున్నాయని తెలిపారు. మిల్లుల్లో దిగుమతికి జాప్యం జరుగుతుండడంతో...గోదాం , ఏఎంసీ షెడ్లలో ధాన్యం దిగుమతి చేస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందనక్కర్లేదని , సంయమనం పాటిస్తూ అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

**సిద్దిపేట పీటీసీ**

**మంచిర్యాల కలెక్టర్**

ధాన్యం నిల్వ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బెల్లంపల్లిలో వ్యవసాయ మార్కెట్ గోదామును పరిశీలించిన ఆయన.. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం తరలింపు , నిల్వ ప్రక్రియ అంతా సజావుగా సాగేలా చూడాలని సూచించారు. ధాన్యం దెబ్బతినకుండా కేటాయించిన ప్రకారం

గోదాములు, రైస్ మిల్లలకు తరలించాలని ఆదేశించారు. గోదాములకు వచ్చే ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకుని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని , రైస్ మిల్లర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**మంచిర్యాల పీటీసీ**

**కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

కరీంనగర్ కలెక్టర్ చిత్ర మిశ్రా , పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం రాత్రి ఓ రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీలు చేశారు. గంగాధర మండలం గట్టుబూత్కుర్ గ్రామంలోని జానకిరామ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లుకు వెళ్లి...ధాన్యం దిగుమతి ప్రక్రియను పరిశీలించారు. ధాన్యం అన్ లోడింగ్ వేగవంతంగా జరగడానికి మరింత మంది కూలీలను ఏర్పాటు చేసుకోవాలని రైస్ మిల్లర్ కు సూచించారు. మిల్లులో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన వలస కూలీలతోనూ కలెక్టర్ , ఎస్పీ మాట్లాడారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**కరీంనగర్ పీటీసీ**

**ఎండ తీవ్రత**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎండ తీవ్రత మరింతగా పెరిగింది. 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నిన్న మణుగూరు , దుమ్ముగూడెం, లక్ష్మీదేవిపల్లి, బూర్గంపహాడ్, చుంచుపల్లి, పినపాకలో 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని 20 ప్రాంతాల్లో 45 డిగ్రీల కంటే ఎక్కువ టెంపరేచర్ రికార్డయ్యింది. అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయన్న హెచ్చరికలతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వైద్య శాఖ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు ప్రయాణాలకు దూరంగా ఉండాలని.. డిహైడ్రేషన్ భారిన పడకుండా మంచినీళ్లు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు తరచుగా తాగుతూ ఉండాలని సూచిస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం పీటీసీ